సాక్షి అనంతపురం

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



టన్ను చీనీ రూ.24,290

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24,290, కనిష్టం రూ.5 వేల ప్రకారం విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.14

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.14, కనిష్టంగా రూ.7 ప్రకారం ధర పలికింది.



జిల్లా అంతటా గురువారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటలకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

చెర వీడిన శ్మశానం



శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహబూబ్‌బాషా

సాక్షి ఎఫెక్ట్..

ఉరవకొండ: మండల పరిధిలోని బూదగవి గ్రామంలో ఓ వ్యక్తి చెర నుంచి శ్మశాన వాటిక స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 'సాక్షి'లో ఈ నెల 18వ తేదీన 'శ్మశానాన్నీ చెరబట్టారు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో గురువారం బూదగవి గ్రామంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, మండల సర్వేయర్ రత్నాకర్, వీఆర్‌ఓ కృష్ణకీర్తి పర్యటించారు. సర్వే నం 59లోని 1.40 ఎకరాలను పరిశీలించారు. గతంలో శ్మశాన వాటిక కోసం ప్రభుత్వం ఈ స్థలాన్ని కేటాయించినట్లు గుర్తించారు. ప్రయివేట్ సర్వేయర్ మహ్మద్ రఫీ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, కంది పంట సాగు చేస్తున్నట్లు వెల్లడైంది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ శ్మశాన స్థలం ఆక్రమించుకుని, పంటలు సాగుచేస్తున్న వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

యాడికి: పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జనార్దన నాయుడు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయాన్ని డీపీఓ జనార్దన నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డులో ఉంచిన ప్లాస్టిక్ వస్తువులు, ఎరువులను ప్రతి గురువారం విక్రయించి పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరరాజు, ఈఓపీఆర్డీ శశికళ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- డీఏఓ ఉమామహేశ్వరమ్మ

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట గ్రామాల్లోని సొసైటీల ద్వారా వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ సూచించారు. గురువారం ఆయా గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. వరి కోతలు పూర్తవుతున్న నేపథ్యంలో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఉద్దేహాళ్ సొసైటీ ద్వారా 3,850 క్వింటాళ్లు, శ్రీధరఘట్ట సొసైటీ ద్వారా 4,590 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు పూర్తయిందన్నారు. కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం శ్రీధరఘట్టలో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. రైతులు ప్రీమియం చెల్లించి బీమా పొందాలన్నారు. పంటల బీమా చెల్లింపునకు కేంద్ర ప్రభుత్వం ఈనెల 31 వరకు గడువు పొడిగించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సాయికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'భోజనం బాగుంటుందా?'



పిల్లలతో మాట్లాడుతున్న డీఈఓ

అనంతపురం ఎడ్యుకేషన్: 'రోజూ మధ్యాహ్న భోజనం బాగుంటుందా? మెనూ ప్రకారం పెడుతున్నారా?' అంటూ జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) ఎం. ప్రసాద్‌బాబు విద్యార్థులను ఆరా తీశారు. గురువారం ఆయన అనంతపురం రూరల్ మండలం కొడిమి ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. వివిధ అంశాలపై విద్యార్థులను ఆరా తీశారు. విద్యా సామర్థ్యాలను తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా తెలుగు, ఇంగ్లిష్, గణితం పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు ఉచితంగా కల్పిస్తోందన్నారు. దాదాపు పేద వర్గాల పిల్లలే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుంటారన్నారు. వారికి నాణ్యమైన విద్య బోధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. చదువుతోనే పేదరికం దూరమవుతుందన్నారు. అలాంటి చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదివేలా తీర్చిదిద్దాలని కోరారు.

జ్వరకంపితం





జ్వరపీడితులతో కిక్కిరిసిన అనంతపురం సర్వజనాస్పత్రిలోని ఓ వార్డు

జిల్లాపై 'చలి' పంజా విసురుతోంది. ఇటీవల చలిగాలుల తీవ్రత బాగా పెరిగింది. ఉదయం, మధ్యాహ్నం కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇదే క్రమంలో వైరల్ జ్వరాలు పడగ విప్పాయి. సర్కారు ఉదాసీనత కారణంగా పారిశుధ్య నిర్వహణపై ఆరోగ్య శాఖ చేతులెత్తేయడంతో బాధితులు విలవిలలాడుతున్నారు.

వణికిస్తున్న విషజ్వరాలు

- విజృంభిస్తున్న డెంగీ, మలేరియా
- జ్వరం, దగ్గు, జలుబుతో అవస్థలు పడుతున్న ప్రజలు
- గడిచిన రెండు నెలల్లో 3 వేలకు పైగా జ్వరం కేసులు నమోదు
- 500కు పైగా చిన్నారులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

అనంతపురం మెడికల్: జిల్లా ప్రజలను విష జ్వరాలు వణికిస్తున్నాయి. గడిచిన రెండు నెలల్లో ఒక్క అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోనే 3,500కు పైగా జ్వరపీడితులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అందులో 700 మందికి పైగా చిన్నారులుండటం కలవరపెడుతోంది. జ్వరం, దగ్గు, జలుబు తదితర సమస్యలతో ఇటీవల పెద్దలు, పిల్లలు మంచాన పడుతున్నారు.

సర్వజనాస్పత్రికి తాకిడి..

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు పెద్ద దిక్కైన సర్వజనాస్పత్రిలో రోజూ 2 వేల నుంచి 2,500 ఓపీ నమోదవుతుంది. 1,100 నుంచి 1,300 వరకు ఇన్‌పేషంట్లు అడ్మిషన్‌లో ఉంటారు. కొన్ని రోజులుగా ఆస్పత్రిలో రోజూ 30కి పైగా జ్వర బాధితులు నమోదవుతున్నారు. ప్రస్తుతం ఓపీ నంబర్ 2, 3, 4లో వందల సంఖ్యలో చికిత్స పొందుతున్నారు. జ్వరంతో బాధపడుతూ చిన్నపిల్లల వార్డులో 21

సర్వజనాస్పత్రిలో జ్వరాల కేసుల వివరాలు			
నెల	జ్వర పీడితులు	అందులో చిన్నారులు	మొత్తం
అక్టోబర్	1,196	265	1,462
నవంబర్	1,057	255	1,312
డిసెంబర్ ఇప్పటివరకు	482	248	730

మంది చిన్నారులుండటం గమనార్హం. జిల్లాలోని అనంతపురం అర్బన్, రూరల్, ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుత్తి, గుంతకల్లు, రాప్తాడు, శింగనమల, నార్పల, తాడిపత్రి తదితర ప్రాంతాల నుంచి జ్వరం కేసులు అధికంగా నమోదవుతున్నాయని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి.

ఆరోగ్యశాఖ బుకాయింపు..

జిల్లావ్యాప్తంగా డెంగీ, మలేరియా బారిన పడుతున్న వారి సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది. అయితే, ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం అలాంటిదేమీ లేదంటూ బుకాయిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి కేవలం 125 డెంగీ, 10 మలేరియా కేసులు నమోదైనట్లు చెబుతున్నారు. కానీ ఈ సంఖ్య వందల్లోనే ఉంటుందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి.

పడకేసిన పారిశుధ్యం..

సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో జిల్లాలో పారిశుధ్యం పడకేయడం ఆందోళన కలిగిస్తోంది. అనంతపురం జిల్లా కేంద్రంలో అయితే పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. చెత్త సేకరణ పూర్తి స్థాయిలో జరగడం లేదు. రోడ్లు చెత్తకుప్పలతో నిండిపోతున్నాయి. ఎక్కడ చూసినా దుర్వాసన వెదజల్లుతోంది. జిల్లా కేంద్రంలో రోజూ 140 టన్నుల చెత్త సేకరణ జరగాల్సి ఉన్నా.. కేవలం 50 టన్నులు మాత్రమే కంపోస్టుయార్డుకు వెళ్తోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.



సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో జ్వరంతో అడ్మిషన్‌లో ఉన్న చిన్నారులు

నిర్లక్ష్యం చేయొద్దు

చలికాలంలో శ్వాసకోస సంబంధిత ఆస్తమా, నిమోనియా సమస్యలతో పాటు విష జ్వరాల కేసులు అధికంగా వస్తున్నాయి. జ్వరపీడితుల్లో ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉంటున్నాయి. జ్వరం వస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దు. గ్రామాల్లో ఆర్‌ఎంపీ వైద్యుల వద్దకు వెళ్లి ఇష్టానుసారంగా మాత్రలు తీసుకుని ఇబ్బంది పడొద్దు. అనంతపురం సర్వజనాస్పత్రిలో మెరుగైన సౌకర్యాలున్నాయి. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం పొందవచ్చు.

– డాక్టర్ భీమసేనాచార్, హెచ్‌ఓడీ, మెడిసిన్

జాగ్రత్తగా చూసుకోవాలి

చలి కాలంలో చిన్నారులు ఊపిరితిత్తుల సమస్యతో ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి. చల్లని పదార్థాలు ఇవ్వరాదు. చలి తీవ్రత ఉండే సమయంలో చిన్నారులను బయట తిప్పరాదు. అలాగే, దోమకాటుకు గురి కాకుండా చూసుకోవాలి.

– డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

బీమా ప్రీమియం గడువు పొడిగింపు

అనంతపురం అగ్రికల్చర్: రబీకి సంబంధించి వాతావరణ, ఫసల్‌బీమా పథకాల కింద గుర్తించిన పంటలకు రైతులు తమ వాటా ప్రీమియం కట్టడానికి నెలాఖరు వరకు గడువు పొడిగించినట్లు వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదట ఇచ్చిన గడువు ఈనెల 15 తేదీతో ముగిసిందన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ఇంకా చాలా మంది రైతులు ప్రీమియం చెల్లించని పరిస్థితి ఉన్న నేపథ్యంలో గడువు పొడిగించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఇన్సూరెన్స్ కంపెనీల దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీంతో ఈనెల 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈనెల 15వ తేదీ వరకు 37 శాతం మంది రైతులు ప్రీమియం చెల్లించారన్నారు. గడువు పొడిగించడంతో మిగతా రైతులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖకు చెందిన గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులు కూడా రైతులు ప్రీమియం కట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పప్పుశనగ రైతులు ఎకరాకు రూ.450, వేరుశనగ రైతులు ఎకరాకు రూ.480, జొన్న రైతులు రూ.315, మొక్కజొన్న రైతులు రూ.525, వరి రైతులు రూ.630, టమాట రైతులు రూ.1,600, మామిడి రైతులు ఎకరాకు రూ.1,650 ప్రకారం ప్రీమియం చెల్లించాలన్నారు. ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు, మీ–సేవా, సీఎస్‌సీ సెంటర్లు, ఇన్సూరెన్స్ పోర్టల్‌లో తమ వాటా కట్టి బీమా పథకంలో చేరాలని సూచించారు.

సైబర్ నేరగాళ్ల బురిడీ

- ఖాతాలోంచి రూ. 2 లక్షల మాయం

రాయదుర్గం: ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.2 లక్షలను మాయం చేసిన ఘటన డీ హీరేహాళ్ మండలం గొడిశెలపల్లిలో జరిగింది. వివరాలు.. గొడిశెలపల్లికి చెందిన టీడీపీ నేత హనుమంతరెడ్డి గురువారం రాయదుర్గం బయలుదేరాడు. మార్గంమధ్యలో చదం గేటు దాటగానే వాట్సాప్‌నకు ఓ లింక్ వచ్చింది. హనుమంతరెడ్డి దానిపై నొక్కగానే తొలుత తన బ్యాంకు ఖాతాలోని రూ.41 వేలు కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. పరిశీలించేలోగా మళ్లీ రూ.1.40 లక్షలు వెళ్లిపోయాయి. ఈ క్రమంలో కంగారు పడిన హనుమంతరెడ్డి.. వెంటనే బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించారు. తన ఖాతాను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారని, హోల్డ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో వెంటనే బ్యాంకు సిబ్బంది ఆమేరకు చర్యలు చేపట్టారు. బ్యాంకు వారి తక్షణ చర్యతో ఖాతాలోని మరో రూ.7 లక్షలు సేవ్ అయ్యాయని హనుమంతరెడ్డి తెలిపారు. ఈ విషయంపై రాయదుర్గం అర్బన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.

ఓటరు సవరణ.. రాప్తాడు చివరన



పరిష్కరించిన దరఖాస్తులను ఈనెల 17న ర్యాండమ్ చెక్ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

- 24 తేదీతో ముగియనున్న పరిష్కార గడువు
- ప్రస్తుతం పెండింగ్ దరఖాస్తులు 3,950
- అత్యధికంగా రాప్తాడు నియోజకవర్గంలో 1,600

నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు					
నియోజకవర్గం	ఫారం-6	ఫారం-7	ఫారం-ఎ	మొత్తం	పరిష్కరించాల్సిన దరఖాస్తులు
రాయదుర్గం	23,834	20,787	26,119	70,740	150
ఉరవకొండ	23,268	13,818	19,007	56,093	231
గుంతకల్లు	25,587	18,599	23,398	67,584	161
తాడిపత్రి	26,036	17,689	19,933	63,658	632
శింగనమల	20,724	16,081	21,036	57,841	182
అనంతపురం	35,845	25,332	38,878	1,00,055	726
కళ్యాణదుర్గం	22,030	19,212	16,535	57,777	268
రాప్తాడు	34,553	37,815	21,754	94,122	1,600
మొత్తం	2,11,877	1,69,333	1,86,660	5,67,870	3,950

అనంతపురం అర్బన్: ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. అయితే, ఓటరు నమోదు, తొలగింపు, వివరాల మార్పునకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంలో రాప్తాడు నియోజకవర్గం చాలా వెనుకబడింది. ఆ తరువాత తాడిపత్రి నియోజకవర్గం ఉంది. మూడు కేటగిరీలకు సంబంధించి 5,67,870 దరఖాస్తులకు గానూ 3,950 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది. ఇందులో ఒక్క రాప్తాడు నియోజకవర్గంలోనే 1,600 దరఖాస్తులు, తాడిపత్రి నియోజకవర్గంలో 632 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

ఓటు నమోదుకు అత్యధికం..

ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం గత నెల 28వ తేదీ వరకు అందిన దరఖాస్తులు, అభ్యంతరాలను ఈనెల 24వ తేదీలోగా పరిష్కరించాల్సి ఉంది. ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభమైంది. గత నెల 28వ తేదీ వరకు ఓటరు నమోదు (ఫారం-6), ఓటు తొలగింపు (ఫారం-7), ఓటు వివరాల మార్పు (ఫారం-8)నకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారు. అయితే ఓటరు నమోదు, ఓటు తొలగింపు, ఓటు వివరాల మార్పు నిరంతర ప్రక్రియ. ఈ క్రమంలో 2023, ఏప్రిల్ 17 నుంచి ఈఏడాది నవంబరు 28వ తేదీవరకు మూడు కేటగిరీలకు సంబంధించి 5,67,870 దరఖాస్తులు అందాయి. ఓటరుగా నమోదుకు 2,11,877 దరఖాస్తులు, తొలగింపునకు 1,68,333, ఓటు వివరాల మార్పునకు 1,86,660 దరఖాస్తులు ఉన్నాయి.

సీఓలు లేక..

రాప్తాడు, తాడిపత్రి నియోజకవర్గాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు లేని కారణంగా దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ఈ రెండు నియోజకవర్గాలకు సంబంధించిన ఇద్దరు ఆపరేటర్లలో ఒకరిని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో, మరొకరిని కలెక్టరేట్‌లో నియమించారు. దీంతో ఈ ప్రభావం దరఖాస్తుల పరిష్కార ప్రక్రియపై పడింది.

పరిష్కారం.. పరిహాసం..!

- రెవెన్యూ సదస్సు.. అంతటా తుస్సు
- ఇప్పటివరకూ 3,337 వినతులందితే పరిష్కరించింది 90 అర్జీలనే

అనంతపురం అర్బన్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యమంటూ కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో ప్రజలకు ప్రయోజనం లేకుండా పోతోంది. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు.. ఆ తర్వాత వాటికి పరిష్కారం చూపే విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టడం లేదు. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. జిల్లావ్యాప్తంగా ఈనెల 6న రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. 503 గ్రామాల్లో సదస్సులు నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 215 గ్రామాల్లోనే కార్యక్రమాలు నిర్వహించారు. సదస్సులు ప్రారంభమైన రోజు నుంచి గురువారం వరకు ప్రజల నుంచి 3,337 అర్జీలు అందాయి. ఇందులో 90 అర్జీలు మాత్రమే



బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తిలో అర్జీలు స్వీకరిస్తున్న కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు

పరిష్కరించారు. బాధితుడు తన సమస్యను సదస్సు దృష్టికి తీసుకువచ్చినప్పుడు.. అధికారులు అవసరమైతే క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు జరిగిన సదస్సుల్లో క్షేత్రస్థాయిలోకి వెళ్లిన సందర్భాలు ఒక్కటి కూడా లేకపోవడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే అర్జీల పరిష్కారం ఏస్థాయిలో జరుగుతోందనేది స్పష్టంగా తెలుస్తోంది.

ప్రేమ పేరుతో వేధింపులు.. యువకుడికి మూడేళ్ల జైలు

అనంతపురం: ప్రేమ పేరుతో బాలికను వేధించిన ఓ యువకుడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష పడింది. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఎస్. నరసప్ప కుమారుడు ఎస్. మధు అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో వేధించేవాడు. బాలికను, ఆమె తల్లిని అంతు చూస్తా అంటూ బెదిరించేవాడు. దీనిపై బాలిక ఫిర్యాదు మేరకు 2021లో చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతపురం పోక్సో కోర్టులో కేసు విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న స్పెషల్ జడ్జి రాజ్యలక్ష్మి గురువారం తీర్పు వెలువరించారు. నేరం రుజువు కావడంతో నిందితుడు ఎస్. మధుకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించారు. అలాగే బాధిత యువతికి ప్రభుత్వం తరఫున రూ.50 వేలు చెల్లించాలని ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పీపీ ఈశ్వరమ్మ వాదించారు. కోర్టు లైజెన్ ఆఫీసర్ శ్రీనివాసులు, చిలమత్తూరు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ గురుస్వామి, స్పెషల్ పీపీని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

ప్రాణాల మీదికి ప్రశ్నపత్రాలు

- సర్కారు ఒంటెద్దు పోకడలతో హెచ్‌ఎంల విలవిల
- గతంలో ఎప్పుడూ లేనివిధంగా పోలీస్ స్టేషన్లలో ఎస్‌ఏ-1 ప్రశ్నపత్రాలు
- అక్కడి నుంచి పాఠశాలలకు తీసుకొచ్చే బాధ్యత ప్రధానోపాధ్యాయులపై..
- దూర ప్రాంతాల్లోని స్కూళ్ల హెచ్‌ఎంల బెంబేలు
- చిత్తూరు జిల్లాలో ప్రశ్నపత్రాలు తీసుకెళ్తూ టీచరు మృతి
- ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటూ బలి చేస్తున్నారని టీచర్ల ఆవేదన



అనంతపురం ఎడ్యుకేషన్: ఒకరికి వచ్చిన రోగానికి మందు వేయకుండా, అందరినీ రోగులుగా మార్చిన చందంగా ప్రభుత్వ వ్యవహారం ఉందంటూ మండిపడుతున్నారు ప్రధానోపాధ్యాయులు. పాఠశాలలకు పెద్దలైన వీరికి ఎస్‌ఏ–1 పరీక్షల నిర్వహణ ప్రాణాలమీదికి తెస్తోంది. గతంలో 6–7 కిలోమీటర్ల దూరంలో ఉన్న స్కూల్ కాంప్లెక్స్ నుంచి ప్రశ్నపత్రాలు తెచ్చుకునేవారు. అయితే ఈసారి గణితం పేపరు యూట్యూబ్‌లోకి వెళ్లిందనే కారణంగా ఆ పరీక్షను వాయిదా వేసి తక్కిన పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచి రోజూ అక్కడి నుంచి తెచ్చుకోవాలంటూ ఈనెల 16న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నారు.

లబోదిబోమంటూ..

6–10 తరగతుల ప్రశ్నపత్రాలను సమీప పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు. రోజూ రెండు పూటలా పరీక్షలున్నాయి. అంటే రోజూ రెండుసార్లు విధిగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిందే. ఈ క్రమంలో స్టేషన్లకు 30–35 కిలోమీటర్ల దూరంలో ఉన్న స్కూళ్ల హెచ్‌ఎంల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. బెళుగుప్ప మండలంలోని కాలువపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పోలీస్‌స్టేషన్‌కు దాదాపు 30 కిలోమీటర్ల దూరం ఉంది. నూతిమడుగు పాఠశాల నుంచి కంబదూరు పోలీస్‌స్టేషన్‌కు దాదాపు 28 కిలోమీటర్ల దూరం ఉంది. గొడిశలపల్లి జెడ్పీ హెచ్‌ఎస్ నుంచి డి.హీరేహాళ్ పోలీస్‌స్టేషన్‌కు దాదాపు 36 కిలోమీటర్ల దూరం ఉంది. ఎనుమలదొడ్డి జెడ్పీహెచ్‌ఎస్ నుంచి కుందుర్పి పీఎస్ దాదాపు 27 కిలోమీటర్లు ఉంది. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రోజూ రెండుపూటలా పోలీస్ స్టేషన్లకు వెళ్లి ఎస్‌ఏ–1 ప్రశ్నపత్రాలు తెచ్చుకోవడం ఇబ్బందిగా మారింది. ఇలాంటి స్కూళ్లు జిల్లా వ్యాప్తంగా అనేకం. దీంతో హెచ్‌ఎంలు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది.

మహిళా హెచ్‌ఎంల పరిస్థితి ఘోరం..

ఒక్కోసారి ఆయా రూట్లకు వేళకు బస్సులుండవు. పురుష హెచ్‌ఎంలు అయితే ద్విచక్ర వాహనాలు తీసుకొని వెళతారు. మరి మహిళా హెచ్‌ఎంల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఆటోలు, ఇతర వాహనాలను అద్దెకు తీసుకొని వెళ్తున్నారు. ఈ క్రమంలో వీరికి రక్షణ కూడా కరువవుతోంది. రవాణా ఖర్చులు హెచ్‌ఎంలే భరిస్తున్నారు. ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చి చేతులు దులుపుకొన్నారంటూ హెచ్‌ఎంలు వాపోతున్నారు. ప్రభుత్వ అశాస్త్రీయ నిర్ణయాలకు తాము బలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలో గురువారం సోషల్ ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్ నుంచి తీసుకెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ టీచరు తీవ్రంగా గాయపడి మరణించాడని, ఈ దుర్ఘటనకు బాధ్యులెవరని హెచ్‌ఎంలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వమే ప్రశ్నపత్రాలను పాఠశాలలకు చేర్చేలా చర్యలు తీసుకోవాల్సింది పోయి.. ఎక్కడో దూరం ఉన్న పీఎస్‌లకు పంపుతున్నారని వాపోతున్నారు. ఈ సమయంలో తీవ్ర ఆందోళనగా ఉంటారని, జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇలాంటి పద్ధతులకు స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

మహిళల చైతన్యంతోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న ఎన్‌ఎఫ్‌ఏ అధికారి భానుమతి

రాప్తాడు: మహిళలు చైతన్యవంతులైతే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా ఎన్‌ఎఫ్‌ఏ (న్యాచురల్ పార్మింగ్ అసోసియేట్) అధికారి భానుమతి అన్నారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రకృతి వ్యవసాయం, రైతు సాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రాప్తాడు మండలం మరూరులో విద్యార్థులు, మహిళా స్వయం సంఘాల సభ్యులకు గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో భానుమతి మాట్లాడుతూ... మహిళలపై జరిగే హింసను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ ఎంఎంటీఎల్ భూపాల్‌రెడ్డి, ఆర్‌వైఎస్ఎస్ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతురాలు అనంతమ్మ

బ్రహ్మసముద్రం : విద్యుత్ షాక్‌కు గురై ఓ మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం తీటకల్లు గ్రామానికి చెందిన కె.అనంతమ్మ (58) గురువారం ఉదయం కొళాయికి అమర్చిన మోటార్ ప్లగ్‌ను సాకెట్‌లో పెడుతుండగా కరెంట్ షాక్‌కు గురైంది. దీంతో గాయపడిన ఆమెను కుటుంబసభ్యులు చికిత్స కోసం కళ్యాణదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

‘పది’ ఎన్‌ఆర్‌ల సవరణకు అవకాశం

అనంతపురం ఎడ్యుకేషన్: వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్‌లో పొందుపరిచిన విద్యార్థుల నామినల్ రోల్స్‌లో ఏవైనా తప్పిదాలుంటే ఈ నెల 23లోపు సవరణ చేసుకోవచ్చునని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుర్తింపు పొందిన అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కనిపించిందా.. కాజేస్తారు!

- అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్
- సొంతిల్లు కట్టుకోవాలన్న మోజులో దొంగతనాలు
- రైతుల పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి వైర్లు, సర్వీస్ కండక్టర్ల అపహరణ

స్వాధీనం చేసుకున్న రాగి వైర్ల బరువు	450 కిలోలు
అల్యూమినియం వైర్ల బరువు	180 కిలోలు

నిర్మానుష్య ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కనిపిస్తే చాలు వారు కాజేస్తారు. వాటిని ధ్వంసం చేసి అందులోని రాగి వైర్‌ను అపహరిస్తారు. ఒకట్రెండు కాదు... ఏకంగా 33 ప్రాంతాల్లో యథేచ్ఛగా చోరీలు సాగిస్తూ వచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైర్లతో పాటు విలువైన సర్వీస్ కండక్టర్‌నూ అపహరించే వీరి ఆగడాలకు ఎట్టకేలకు తెరపడింది.



స్వాధీనం చేసుకున్న రాగి వైర్లను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: విద్యుత్ శాఖలో దినసరి కూలీలుగా పనిచేస్తూ రైతుల వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించిన సర్వీస్ కండక్టర్, ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైర్లను అపహరించుకెళ్లే అంతర్ జిల్లా దొంగల ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ పి.జగదీష్ వెల్లడించారు.

నలుగురు పట్టుబడి... ఇద్దరు పరారై!

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత ఏడాదిగా రైతుల పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని రాగి తీగలను అపహరించుకెళ్లే ఘటనలు ఇటీవల పెచ్చుమీరాయి. దీంతో ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో సీసీఎస్ బృందం సీఐలు ఇస్మాయిల్, జైపాల్‌రెడ్డి, సిబ్బంది, అనంతపురం రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ రాంబాబు ఆధ్వర్యంలో బృందాలుగా విడిపోయి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో పక్కా ఆధారాలతో గురువారం ఉదయం కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన రాఘవేంద్ర, ఎర్రిస్వామి, రాంపురం గ్రామానికి చెందిన చిరంజీవి, పరంధామను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. మొత్తం 33 కేసుల్లో వీరు చోరీ చేసిన 450 కిలోల రాగి వైర్లు, 180 కిలోల సర్వీస్ కండక్టర్ (అల్యూమినియం)ను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇదే కేసులో కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన వాసు, వెంకటాంపల్లికి చెందిన వన్నూరుస్వామి అలియాస్ జానీ పరారీలో ఉన్నారు.

ఒకరికొకరు తోడయ్యారు ఇలా...

పట్టుబడిన ముఠా సభ్యుల్లో రాఘవేంద్ర ప్రధాన నిందితుడు. వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. విద్యుత్ శాఖ అధికారులకు, హెల్పర్లకు సపోర్ట్ వర్కర్‌గా వెళ్లేవాడు. పని ఉన్న రోజు కూలీ ఇచ్చేవారు. సొంతిల్లు కట్టుకోవాలని ఆయన చిరకాల కోరిక. దీంతో రోజు వారీ కూలి కుటుంబపోషణకే సరిపోయేది కాదు. ఈ క్రమంలో సొంతింటి నిర్మాణం తీరని కలగానే మిగిలిపోతుందని భావించిన రాఘవేంద్ర... చోరీలను ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో తనకున్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని పంట పొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైర్లను, సర్వీస్ కండక్టర్లను అపహరించాలని పథకం వేశాడు. ఇందుకు విద్యుత్ బిల్లులు తీసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చిరంజీవి, పరంధామను జత చేసుకున్నాడు. వీరికి ఎలక్ట్రీషియన్లు వాసు, వన్నూరుస్వామి, ఎర్రిస్వామి తోడయ్యారు. వీరు ముగ్గురూ విద్యుత్ శాఖ హెల్పర్లకు సపోర్ట్ వర్కర్లుగా వెళ్లేవారు.

నిందితులపై ఉన్న పాత కేసులు	
నిందితుడు	కేసుల సంఖ్య
రాఘవేంద్ర	08
వాసు	03
ఎర్రిస్వామి	02

పథకం ప్రకారం చోరీలు

తొలుత గ్రామాల్లో వన్నూరుస్వామి, ఎర్రిస్వామి సంచరిస్తూ రైతుల పొలాల్లో చోరీ చేయడానికి అనువైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి రాఘవేంద్రకు సమాచారం ఇచ్చేవారు. అనంతరం వాసు, చిరంజీవి, పరంధామను కలుపుకుని రాఘవేంద్ర ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి, అందులోని రాగి వైర్లను అపహరించేవారు. ఈ క్రమంలో కొత్త కనెక్షన్లకు సంబంధించి రైతులు సేకరించి పెట్టుకున్న సర్వీస్ కండక్టర్‌నూ ఎత్తుకెళ్లేవారు. అనంతరం వాటిని అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి వద్ద ఉన్న ఓ గుడిసె వద్దకు చేర్చి రాగి వైర్లు, అల్యూమినియం తీగలను కరిగించి ముద్దలుగా మార్చి విక్రయించి సొమ్ము చేసుకునేవారు. పక్కా ఆధారాలతో నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, విచారణ అనంతరం వారిచ్చిన సమాచారం మేరకు కక్కలపల్లి వద్ద గుడిసెలో దాచిన రాగి ముద్దలు, తీగలు, అల్యూమినియం సర్వీస్ కండక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న వాసు, వన్నూరుస్వామి కోసం గాలింపు చేపట్టారు. కాగా, నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ అభినందించారు.

నిందితులపై ఉన్న కేసులు	
పీఎస్	కేసుల సంఖ్య
కళ్యాణదుర్గం రూరల్	06
పుట్లూరు	04
అనంతపురం రూరల్	03
కంబదూరు	03
రాప్తాడు	03
చిలమత్తూరు	02
ఇటుకలపల్లి	02
తాడిపత్రి రూరల్	02
విడపనకల్లు	02
యాడికి	02
బుక్కరాయసముద్రం	02
గార్లదిన్నె	01
కుందుర్పి	01
మొత్తం	33

వీఆర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లు

సాక్షి ఎఫెక్ట్..

యల్లనూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లను వీఆర్‌కు పంపిస్తూ ఎస్పీ జగదీష్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏళ్ల తరబడి బదిలీ కాకుండా యల్లనూరు పీఎస్‌లోనే పాతుకుపోయి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కానిస్టేబుళ్ల తీరుపై ‘తిన మరిగి... తిష్ట వేసి’ శీర్షికన గురువారం ‘సాక్షి’లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. వాస్తవాలు నిగ్గుతేలడంతో కానిస్టేబుళ్లు అక్కులన్న, రవీంద్రారెడ్డిని వీఆర్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇద్దరినీ తక్షణమే రిలీవ్ చేసినట్లు పుట్లూరు సీఐ సత్యబాబు తెలిపారు.

22న ఉమ్మడిశెట్టి పురస్కారాల ప్రదానం

అనంతపురం కల్చరల్: స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో ఆదివారం ఉదయం పది గంటలకు ఉమ్మడిశెట్టి పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు, సీనియర్ కవి రాధేయ గురువారం తెలిపారు. 36వ పురస్కార విజేతగా ఎంపికైన సీనియర్ కవి డాక్టర్ బండిసత్యనారాయణకు, అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన ఉమ్మడిశెట్టి సతీష్‌కుమార్ జాతీయ యువ పురస్కారానికి ఎంపికైన రచయిత్రి చామర్తికి పురస్కారాలను అందజేయనున్నారు. ఇదే సందర్భంగా రాధేయ రాసిన ‘అజేయుడు’ స్మృతి కావ్యాన్ని ఆవిష్కరించనున్నారు. రాష్ట్రంలోని పలువురు కవులు రచయితలు ఆత్మీయ అతిథులుగా విచ్చేస్తున్న ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండల కేంద్రం – కణేకల్లు మండలం హనకనహాల్ గ్రామాల మధ్య నాటుసారా స్థావరాలపై గురువారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అన్నపూర్ణ, ఎస్ఐ హరికృష్ణ, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 700 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఘటనకు సంబంధించి రెండు కేసులు నమోదు చేసినట్లు సీఐ అన్నపూర్ణ తెలిపారు.

గార్లదిన్నెలో గంజాయి కలకలం

గార్లదిన్నె: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కనే ముళ్ల పొదల్లో గంజాయి పొట్లాలు బయటపడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడు చేరుకుని పరిశీలించారు. కాగా, గత కొన్ని రోజులుగా రాత్రి సమయంలో మత్తులో కొందరు యువకులు గొడవలకు పాల్పడుతున్నారు. మద్యం మత్తులో గొడవ పడినట్లుగా అప్పట్లో భావించినా... తాజాగా గంజాయి పొట్లాలు బయటపడడంతో గార్లదిన్నె వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అనంతపురానికి చెందిన కొందరు వ్యక్తులు గుట్టు చప్పుడు కాకుండా గార్లదిన్నెలోని కొందరు యువకులకు గంజాయి విక్రయిస్తున్నట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో పోలీసులు లోతైన విచారణ చేపట్టారు. కాగా, గంజాయి పొట్లాల లభ్యంపై పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

మత్తులో యువకుల మధ్య గొడవ

మత్తులో యువకులు బాహాబాహీకి దిగిన ఘటన బుధవారం రాత్రి గార్లదిన్నెలో చోటు చేసుకుంది. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న మూతపడిన ధాబా ప్రాంతంలో కొందరు యువకులు మద్యం సేవించి మత్తులో పరస్పర దాడులకు తెగబడ్డారు. ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని యువకులను అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఘటన జరిగిన చోట ఖాళీ మద్యం బాటిళ్లతో పాటు వాడి పడేసిన గంజాయి పొట్లాలను గుర్తించారు.

వృద్ధుడి దుర్మరణం



మృతుడు ఉజ్జినప్ప

బొమ్మనహాళ్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన నాగరాజశెట్టి... ట్రాక్టర్ తీసుకు వచ్చేందుకు కణేకల్లు క్రాస్‌కు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గ మధ్యంలో ఉప్పరహాళ్ క్రాస్ వద్ద కృష్ణాపురం గ్రామానికి చెందిన హరి, ఉజ్జినప్ప(65)ను తన ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని వెళుతుండగా గోనేహాళ్ క్రాస్‌లోకి చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా భుజంపై బస్తా మోసుకుని వచ్చిన గొర్రెల కాపరిని తప్పించే క్రమంలో వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఘటనలో తలకు తీవ్రగాయమై ఉజ్జినప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. హరి, నాగరాజశెట్టి గాయాలతో బయటపడ్డారు. ఉజ్జినప్ప తమ్ముడు కురుబ బసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు పోలీసులు కేసు నమోదు చేశారు.

జరిమానా చెల్లించకపోతే వాహనాలు సీజ్ : ఎస్పీ

అనంతపురం: ట్రాఫిక్ ఉల్లంఘన, సరైన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడి సందర్భాల్లో విధించిన జరిమానాలను మూడు నెలల్లోపు చెల్లించకపోతే సదరు వాహనాలను సీజ్ చేస్తామని ఎస్పీ జగదీష్ స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు రోడ్డు భద్రత ఉల్లంఘనదారులపై చర్యలు మరింత కఠినతరం చేసినట్లు పేర్కొన్నారు. ట్రిబుల్ రైడింగ్, రాంగ్ పార్కింగ్, ఆటోల ఓవర్ లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, నంబర్ లెస్ వాహనాలు, ర్యాష్ డ్రైవింగ్, రేసింగ్‌లపై దృష్టి సారిస్తామన్నారు.

3వ తరగతి విద్యార్థుల మధ్య ఘర్షణ

బత్తలపల్లి: మండలంలోని కోడేకండ్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల మధ్య గురువారం ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన మేరకు.. కోడేకండ్ల ప్రాథమిక పాఠశాలలో 19 మంది బాలబాలికలు చదువుకుంటున్నారు. వీరికి గత ప్రభుత్వంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చాక సర్దుబాటు పేరుతో ఒక ఉపాధ్యాయురాలిని ఇక్కడ ఉంచి, మరోకరిని వేరే పాఠశాలకు సర్దుబాటు చేశారు. దీంతో అన్ని తరగతులకు సంబంధించి 19 మంది విద్యార్థులకు సునీత అనే ఉపాధ్యాయురాలు బోధన చేస్తోంది. గురువారం టీచర్ సెలవు పెట్టడంతో ఎంఈఓ ఆదేశాల మేరకు డి.చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు తిప్పేస్వామి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో విద్యార్థుల మధ్య ఘర్షణ చెలరేగింది. మూడవ తరగతి చదువుతున్న బాలుడిపై మరో విద్యార్థి రాళ్లతో దాడి చేశాడు. దీంతో విద్యార్థి చేతికి తీవ్ర గాయమైంది. స్థానికుల సాయంతో ఉపాధ్యాయుడు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు విద్యార్థి ఎడమ చేతి వేళ్లు తొలగించాల్సి వస్తుందని తెలిపారు. కాగా, పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని గ్రామస్తులు తెలిపినా ఎంఈఓ పట్టించుకోలేదని, దీంతో సరైన పర్యవేక్షణ లేక ఈ పరిస్థితికి దారి తీసిందంటూ గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు.

నా కోసం వెతకొద్దు!

- ప్రేమికుడి వద్దకు వెళ్తున్నా
- లేఖ రాసి అదృశ్యమైన యువతి

రాప్తాడు రూరల్: ‘అమ్మా నా కోసం ఎక్కడా వెతకొద్దు. ప్రేమించిన వ్యక్తి వద్దకు వెళ్తున్నా’ అంటూ లేఖ రాసి ఓ యువతి అదృశ్యమైన ఘటన గురువారం అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో వెలుగు చూసింది. అనంతపురం రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... కురుగుంటలో నివాసముంటున్న ముస్లిం దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త చనిపోయాడు. కుమారుడు బైకు మెకానిక్‌గా పని చేస్తుండగా, 22 ఏళ్ల వయసున్న కుమార్తె నగరంలోని ఓ షోరూంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ వదిలేసింది. ఈ క్రమంలో గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో తల్లి ఇంట్లో పరిశీలించగా ఓ లేఖ లభించింది. అందులో ‘అమ్మా... నేను సూర్య అనే యువకుడిని ప్రేమించా. ఆయనతోనే వెళ్తున్నా. మీరు నా కోసం వెతకొద్దు. విజయవాడ వెళ్తున్నా. వాళ్ల అమ్మానాన్న కూడా నన్ను బాగా చూసుకుంటారు. ఇంట్లో బంగారు, డబ్బులేవీ తీసుకెళ్లడం లేదు. అన్నా... అమ్మను బాగా చూసుకో’ అంటూ రాసి ఉంది. ఈ లేఖను స్వాధీనం చేసుకున్న అనంతపురం రూరల్ పోలీసులు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యం

కదిరి టౌన్: స్థానిక మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్‌లో నివాసముంటున్న యువతి కనిపించడం లేదు. ఈ మేరకు తల్లి ఫిర్యాదు చేయడంతో పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. బంధువుల అబ్బాయితో ఈ నెల 18న ఎస్‌డీఎస్‌ఎస్ డిగ్రీ కళాశాల వెనుక ఉన్న ఫంక్షన్ హాల్‌లో ఆమెకు వివాహ నిశ్చితార్థం ఏర్పాటు చేశారు. దీంతో బుధవారం సాయంత్రం 4.30 గంటలకు ఆమె ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కదిరికి చెందిన మునివర్ధన్ (గజ), చిన్నాన్న పవన్ కారణమంటూ అనుమానాలు వ్యక్తం చేస్తూ యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

సిమెంట్ కర్మాగార బాధితులను ఆదుకుంటాం

- ఆర్డీఓ శ్రీనివాసులు



ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ ప్రతాపరెడ్డి

యాడికి: మండలంలోని బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న సిమెంట్ కర్మాగారంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో గాయపడిన వారిని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడి అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఆర్డీఓ శ్రీనివాసులు గురువారం ఉదయం కర్మాగారాన్ని సందర్శించి, ప్రమాద ఘటనపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన వెంట యాడికి తహసీల్దార్ ప్రతాపరెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. కాగా, అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, ఎస్పీ జగదీష్ పరామర్శించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం గురువారం ఉదయం క్షతగాత్రులను బెంగళూరుకు తరలించినట్లు జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ తెలిపారు. ప్రమాద ఘటనపై పరిశీలించేందుకు విచారణ కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేశారని, పరిశీలన అనంతరం నివేదికను రూపొందించి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు.నివేదిక ఆధారంగా బాధితులకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని పేర్కొన్నారు.

పట్టాల వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం



గుంతకల్లు: స్థానిక మద్దికెర రైలు మార్గంలో 335/11 కి.మీ వద్ద పట్టాల వద్ద ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కదులుతున్న రైలు నుంచి కింద పడి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి దాదాపు 60 నుంచి 65 ఏళ్ల మధ్య వయసుంటుంది. తెల్లని గళ్ల చొక్కా, నల్ల రంగు ప్యాంట్ ధరించాడు. ఆచూకీ తెలిసిన వారు 98661 44616కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు.

ఆంధ్రా జట్టుకు ఎంపిక



బుడగల నేహ



ఆశ్రియ

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్-19 ఉమెన్ వన్డే క్రికెట్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన బి.నేహ, ఎస్.ఆశ్రియ (కదిరి) ఉన్నారు. కేరళలోని త్రివేండ్రమ్ వేదికగా జనవరి 4 నుంచి 12వ తేదీ వరకూ మ్యాచ్‌లు జరుగుతాయి. కాగా, నేహ కుడిచేతి ఓపెనర్. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. అండర్-19 జిల్లా స్థాయిలో జరిగిన మూడు మ్యాచ్‌ల్లో 170 పరుగులు సాధించారు. ఇందులో ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీ ఉన్నాయి. అలాగే జోనల్ స్థాయిలో జరిగిన 5 మ్యాచ్‌ల్లో 205 పరుగులు సాధించి సత్తా చాటారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన ఎస్.ఆశ్రియ కూడా కుడిచేతి ఓపెనర్. కదిరిలోని ఆర్డీటీ సబ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నారు. అండర్-15 జిల్లా స్థాయి మ్యాచ్‌ల్లో 119 పరుగులు సాధించారు. ఇందులో ఒక అర్ధ సెంచరీ ఉంది. అలాగే జోనల్ స్థాయి మ్యాచ్‌లో 240 పరుగులు సాధించారు.

ప్రజలపై ‘కూటమి’ ఆర్థిక భారం

- టోల్ చార్జీల పెంపు తక్షణం రద్దు చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



అనంతపురం అర్బన్: ప్రజలపై ఆర్థిక భారం మోపడంపైనే కేంద్రంతో పాటు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మండిపడ్డారు. రాష్ట్రంలోని 65 టోల్ ప్లాజాల వద్ద సింగిల్ ఎంట్రీ విధానంతో వాహనదారులపై విధించిన అదనపు టోల్ రుసుము భారాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత విధానం మేరకు ఒకసారి టోల్ ఫీజు చెల్లిస్తే 24 గంటల్లో ఎన్నిసార్లు తిరిగినా కట్టాల్సిన అవసరం లేదన్నారు. అయితే కొత్త నిబంధనల ప్రకారం రూ.160 ఫీజును రూ.240కు పెంచడంతో పాటు సింగిల్ ఎంట్రీ విధానంలో ఎన్నిసార్లు తిరిగితే అన్ని సార్లు రూ.240 చొప్పున చెల్లించాల్సి వస్తోందన్నారు. జిల్లాలోని రెండు జాతీయ టోల్ గేట్‌ల మీదుగా ప్రయాణించే వాహనదారులపై సింగిల్ ఎంట్రీ విధానం కారణంగా వేల రూపాయల భారం పడుతుందన్నారు. ఆర్టీసీపై మరింత అదనపు భారం పడుతుందన్నారు. ఈ భారాన్ని ప్రయాణికులపై సంస్థ వేస్తుందన్నారు. ఇక ఆర్‌అండ్‌బీ రోడ్లకూ టోల్ విధానం ప్రవేశ పెడతామని ఇప్పటికే సీఎం చంద్రబాబు ప్రకటించారని, ఇది ప్రజలకు మరింత పెనుభారం అవుతుందన్నారు. మొత్తం టోల్ విధానాన్ని సమీక్షించి భారాన్ని తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే 20 కిలోమీటర్ల లోపు తిరిగే వాహనాలకు గతంలో పసుపు, తెలుపు బోర్డుల పేరుతో పాసులు ఇచ్చేవారన్నారు. ఇందు కోసం నెలకు రూ.340 చెల్లిస్తే సరిపోయేదన్నారు. ఇప్పుడు పసుపు బోర్డు వాహనాలకు పాసులు పూర్తిగా రద్దు చేసి, తెలుపు బోర్డు వాహనాలపై రుసుం పెంచడం సరికాదన్నారు. ఈ విధానాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు.

సాయిప్రణీత్, అర్జున్ టెండూల్కర్ సెంచరీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్కేయూ రెక్టార్ వెంకటనాయుడు, ఎస్వీ డిగ్రీ కళాశాల చైర్మన్ సోమశేఖరరెడ్డి

అనంతపురం: జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఎస్కేయూ అంతర కళాశాలల క్రికెట్ టోర్నీ సెమీఫైనల్ మ్యాచ్‌లు ఆర్డీటీ స్టేడియంలో గురువారం హోరాహోరీగా సాగాయి. మొదటి మ్యాచ్ బ్లూమూన్ డిగ్రీ కళాశాల(కదిరి), శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల(అనంతపురం) మధ్య జరిగింది. నిర్ణీత 20 ఓవర్లకు గాను తొలుత బ్యాటింగ్ చేసిన బ్లూమూన్ డిగ్రీ కళాశాల జట్టు 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. జట్టులో సాయిప్రణీత్ 162 పరుగులు సాధించి జట్టుకు గణనీయమైన స్కోరును అందించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల జట్టు కేవలం 71 పరుగుల వద్ద చతికిలపడింది. 180 పరుగుల తేడాతో బ్లూమూన్ డిగ్రీ కళాశాల జట్టు గెలుపొందింది. ఎస్ఎస్‌బీఎన్, ఎస్వీ డిగ్రీ కళాశాలల మధ్య జరిగిన రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఎస్‌బీఎన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. జట్టు బ్యాటర్ అర్జున్ టెండూల్కర్ 150 పరుగులు, జయకృష్ణ 54 పరుగులు సాధించి ప్రతిభ చాటారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్వీ డిగ్రీ కళాశాల జట్టు 108 పరుగులకు ఆలౌట్ అయింది. మ్యాచ్‌లను ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, ఎస్వీ డిగ్రీ కళాశాల చైర్మన్ డాక్టర్ సి. సోమశేఖరరెడ్డి, వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు వీక్షించారు.

క్లుప్తంగా

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


దేవరపల్లి ఓబిరెడ్డి (ఫైల్)

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పూలకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేవరపల్లి ఓబిరెడ్డి (65) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి 9 గంటల వరకు బంధువులు, ఇతర గ్రామస్తులతో ఓబిరెడ్డి బాగా ముచ్చటించారు. రాత్రి 12 గంటల సమయంలో వాంతులయ్యాయి. చుట్టుపక్కల వారిని లేపే ప్రయత్నం చేసినా.. 'నాకేం కాలేదు. బాగుందులే' అంటూ సర్ది చెప్పాడు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో గుండెపోటుతో మృతి చెందాడు. ఈయనకు కుమారుడు విశ్వనాథరెడ్డి, కుమార్తె ప్రియాంక సంతానం. ఇద్దరికీ వివాహాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. నిబద్ధత, నిజాయితీగల నాయకుడిని పార్టీ కోల్పోయిందన్నారు. ఓబిరెడ్డి లేకపోవడం పార్టీకి తీరని లోటన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కుల్లాయి స్వామి



అనంతపురం ఎడ్యుకేషన్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఈ.కుల్లాయి స్వామిని ఎన్నుకున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో అనంతపురం నగరానికి చెందిన కుల్లాయి స్వామిని రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన సీపీఐ నాయకులు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడతామన్నారు. విద్యా రంగ సమస్యలపై ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. పాఠశాల స్థాయిలో ఏఐఎస్‌ఎఫ్‌లో చేరాలన్నారు. భవిష్యత్తులో సమాఖ్య బలోపేతానికి మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఏడీఏ రవి

అనంతపురం సెంట్రల్: ప్రస్తుత సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేయాలని వ్యవసాయశాఖ ఏడీ ఎం.రవి ఆదేశించారు. గురువారం ఆయన తన చాంబర్‌లో అనంతపురం డివిజన్‌లోని మండల వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. వేరుశనగ, మొక్కజొన్న, వరి, పప్పుశనగ, టమాట, మామిడి పంటలకు బీమా చేయించుకునేందుకు ఈనెల 31 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. రైతులకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్‌లో పంట నష్టపోతే రైతులకు పరిహారం వస్తుందని తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టాలని సూచించారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం అర్బన్: యాడికి మండలంలోని సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదానికి సంబంధించి కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఘటనపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలన్నారు. చనిపోయిన కార్మికులకు రూ.కోటి పరిహారం, భార్యకు శాశ్వత ఉద్యోగం, చిన్నపిల్లలకు నెలకు రూ.20 వేలు, గాయపడిన కార్మికులు ఒక్కొక్కరికి రూ.20 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. పరిశ్రమలు అభివృద్ధి కావాలంటున్న ముఖ్యమంత్రి కార్మికుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

రాప్తాడు: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. గురువారం మండలంలో పాలచెర్ల, మధ్యాహ్నం భోగినేపల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సమస్యలను సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీఎస్‌డీటీ జ్యోతి, ఆర్‌ఐ కరుణాకర్, సర్వేయర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ప్రభువే.. శరణమయ్యప్ప


హరిహరసుత అయ్యప్ప దేవస్థానంలో హారతి తీసుకుంటున్న భక్తులు


భిక్ష చేస్తున్న శివ, గోవింద, భవానీ, హనుమాన్ మాలధారులు


భోజనం వడ్డిస్తున్న దృశ్యం

నియమ నిష్టలతో చేసే అయ్యప్ప దీక్ష.. మనిషి ప్రవర్తనలో మార్పు తీసుకొస్తుంది. మండల కాలం 41 రోజుల పాటు దీక్షలో ఉన్న భక్తుడు.. దీక్ష తరువాత కూడా దుర్గుణాలను వదిలి సన్మార్గంలో నడిచేలా చేస్తుంది. పవిత్రమైన అయ్యప్ప దీక్ష తీసుకునే భక్తుడిని దేవుడిగా భావిస్తున్నారు. దీక్షలు స్వీకరించిన మాలధారులకు భోజన వసతి కల్పించడం (భిక్ష) అదృష్టంగా చెప్పుకోవచ్చు. జిల్లా కేంద్రంలోని మొదటి రోడ్డు హరిహరసుత అయ్యప్ప దేవస్థానంలో నిత్యం వందలాది మందికి అన్న సంతర్పణ సాగుతోంది. అయ్యప్ప మాలధారులే కాకుండా శివ, గోవింద, భవానీ, హనుమాన్ మాలధారులకు ఇక్కడ మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. వెయ్యి మందికి పైగా అన్నదానం చేస్తున్నామని.. ఇంటి వద్ద సౌకర్యం లేనివారు ఎవరొచ్చినా అయ్యప్ప స్వామి భిక్ష దొరుకుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఆలయంలో నిత్యం అన్నదానంతో పాటూ ప్రార్థనలు, భజనలు కొనసాగుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

నిర్లక్ష్యం ఎవరో చేస్తే శిక్ష టీచర్లకా?

- ఎస్‌ఏ-1 ప్రశ్నపత్రాలను స్కూల్ పాయింట్‌కి చేర్చాలి
- ఏపీటీఎఫ్ నాయకుల ధ్వజం

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్‌ఏ-1 పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రశ్నపత్రం యూట్యూబ్‌లో పెడితే అందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ టీచర్లు శిక్ష అనుభవించాలా? అని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు ధ్వజమెత్తారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. చిత్తూరు జిల్లాలో ప్రశ్నాపత్రాలను పాఠశాలకు తీసుకెళ్తూ ఓ టీచరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని ఇందుకు ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. 30-40 కిలోమీటర్లు ప్రయాణించి ప్రశ్నపత్రాలు తీసుకుని సకాలంలో చేరుకోవాలనే తపనతో ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. అధికారుల అసంబద్ధ నిర్ణయాలే ప్రాణాలను బలికొంటున్నాయన్నారు. దీనికి ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని స్కూల్ పాయింట్‌కి ప్రశ్నాపత్రాలు, పాఠ్య పుస్తకాలు చేర్చాలన్నారు. 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న స్కూళ్లకు గంట ముందు ప్రశ్నాపత్రాలు పోలీస్‌స్టేషన్ వద్ద అందిస్తే వాటిని స్కూల్ పాయింట్‌కు ఎలా చేర్చుతారో అధికారులు ఆలోచించాలన్నారు. బస్సుల సౌకర్యం లేక బైకులు, దొరికిన ఆటోల్లో వెళ్తున్నారన్నారు. వేళకు వెళ్లకపోతే మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ఎక్కడ మాట పడాల్సి వస్తుందోనని భయపడి ఇలా తొందరపాటుతో వేగంగా వెళ్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే ప్రశ్నాపత్రాలను స్కూల్ పాయింట్‌కి చేర్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంధన పొదుపు.. భవిష్యత్తుకు వెలుగు



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈ సంపత్ కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంధనాన్ని పొదుపుగా వినియోగించాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సంపత్ కుమార్ కోరారు. గురువారం స్థానిక గుత్తి రోడ్డులోని మాంటిస్సోరి స్మార్ట్ పాఠశాలలో స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్, ఇంధన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 7, 8, 9 తరగతుల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఎస్‌ఈ మాట్లాడుతూ.. ఇంధనం పొదుపు చేసి భావితరాలకు వెలుగునివ్వాలనే సంకల్పంతో విద్యుత్ వనరులను జాగ్రత్తగా వినియోగించాలన్నారు. పోటీల్లో విద్యార్థులు ఇంధన పొదుపునకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారన్నారు. వ్యాసరచన పోటీల్లో 9వ తరగతి విద్యార్థి ప్రసన్న ప్రథమ స్థానం, గీతిక ద్వితీయ స్థానం, భువన్ తృతీయ స్థానాల్లో నిలిచారు. వక్తృత్వ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని టి.శివప్రజ్ఞ, ఎస్ఎండీ షాహిద్, 7వ తరగతి విద్యార్థిని ఎం.రితీష ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈఈ రమేష్, ఏడీఈ రామకృష్ణ, శ్రీనివాసులు, ఏఈఈ ప్రసాద్, పాఠశాల కరస్పాండెంట్ సి.సూర్యనారాయణ రెడ్డి, కార్యదర్శి కె.మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి


ప్రిన్సిపాల్ షమీనాఖాన్‌ను సన్మానిస్తున్న అహుడా చైర్మన్ టీసీ వరుణ్, ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక హౌసింగ్ బోర్డులోని శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం గురువులకు సన్మానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అహుడా చైర్మన్ టీసీ వరుణ్, పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. గురువులు లేకుంటే ఏ రంగమూ అభివృద్ధి చెందదన్నారు. సంస్కృతంలో గు అంటే చీకటి రు అంటే వెలుతురు అని అర్థమన్నారు. అజ్ఞానం అనే అంధకారాన్ని తొలిగించి బ్రహ్మవిద్య అనే ప్రకాశాన్ని అందించేవాడు గురువు అన్నారు. పిల్లలను కనేవరకే తల్లిదండ్రుల బాధ్యత అని.. వారికి విద్యాబుద్ధులు నేర్పి సమాజానికి ఉపయోగపడేలా భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేది గురువులే అని పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరం పదో తరగతిలో 598 మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించడానికి కృషి చేసిన గురువులకు పురస్కారాలు అందజేశారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షమీనా, అకడమిక్ కో-ఆర్డినేటర్లు రాధాకృష్ణ, ఇర్షాద్, తిరుమలేష్, నాగభూషణం, డీన్ సత్యనారాయణ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు


అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్/అనంతపురం టవర్‌క్లాక్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలి. దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప మాట్లాడుతూ.. రాజ్యసభలో జరిగిన చర్చలో అంబేడ్కర్‌ను కించపరిచేలా దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన అమిత్‌షా వ్యాఖ్యలను కేవీపీఎస్ ఖండిస్తోందన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని పదేపదే చెబుతూ చేస్తున్న ప్రకటనలు చూస్తే రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు జీవరత్నం, రాజా, అక్కులప్ప, నాగరాజు, నాగేంద్ర, నారాయణస్వామి, డేవిడ్, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంటేశులు, కారిక్, నాగు, నారాయణస్వామి, నాగభూషణం, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తక్షణం క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ అనంతపురం అర్బన్ ఇన్‌చార్జి దాదా గాంధీ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. దేవుడిని తలుచుకుంటే పుణ్యం వస్తుంది.. అంబేడ్కర్‌ను తలుచుకుంటే ఏమి వస్తుందంటూ వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వాసు, శర్మాస్ వలి, ఇమాం తదితరులు పాల్గొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అంబేడ్కర్ దేవుడని ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ అన్నారు. రాజ్యాంగ నిర్మాతను అమిత్‌షా కించపరిచేలా మాట్లాడటం తగదన్నారు. తక్షణమే క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో జైభీమ్ రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చాలీసా పారాయణ పోటీలు


పోటీలకు హాజరైన విద్యార్థులు

అనంతపురం కల్చరల్: జనవరిలో భారీ ఎత్తున జరగనున్న సామూహిక పారాయణ ప్రచారంలో భాగంగా రెండు రోజుల పాటూ జిల్లాలోని విద్యార్థులందరిని పోటీల్లో భాగస్వాములు చేస్తున్నారు. గురువారం స్థానిక లలిత కళాపరిషత్తులో జరిగిన కార్యక్రమానికి సంగీత విద్వాంసులు, ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు, విద్యాసంస్థల అధినేతలు, కళాకారులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 50 పాఠశాలల నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు హనుమాన్ చాలీసా ఆలపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నాట్యాచార్యులు సంధ్యామూర్తి, పాల సముద్రం నాగరాజు, అపుస్మా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, వెంకటేశ్వర ప్రసాద్, ఆకుల రాఘవేంద్ర, చాలీసా ప్రచార సమితి నాయకులు ప్రమోద్ స్వామి, సత్యనారాయణ, శ్రీపాద వేణు, హర్షద్ జైన్, సుధాకర బాబు, వకీల్ మురళీ, వేణుగోపాల్, గాయకులు కేవీ మహీధర్, నాగమ్మ, ఆర్యవైశ్య యువజన సంఘం శబరి, బ్రాహ్మణ సంఘం శ్రీనిధి రఘు, ఏపీడీఎస్‌ఏ రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఆర్టీసీ కార్గో సేవలు

- ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని

అనంతపురం క్రైం: ఆర్టీసీ కార్గో పార్శిల్ సర్వీసు సేవలు నేరుగా ఇంటి వద్దకే అందిస్తామని ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీఎస్ ఆర్టీసీలో కార్గో, పార్శిల్ సేవలను ప్రజలకు చేరువగా తీసుకెళ్లేందుకు 2021 నవంబరు 9న డోర్ డెలివరీ సదుపాయం ప్రారంభించామన్నారు. సేవలపై ప్రచారం కోసం ఏటా ఏపీఎస్ ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవం నిర్వహిస్తోందన్నారు. ఈ ఏడాది డోర్ డెలివరీ మాసోత్సవం 2024 డిసెంబరు 20 నుంచి 2025 జనవరి 19 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్గో డోర్ డెలివరీ సేవలపై ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. జిల్లాలో ప్రధానంగా అనంతపురం, గుత్తి, గుంతకల్, రాయదుర్గం, తాడిపత్రి పట్టణాల్లో డోర్ డెలివరీ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. 50 కేజీల బరువు వరకు బుకింగ్ చేసిన పార్శిల్, కొరియర్స్ కస్టమర్ ఇంటి వద్దకే చేర్చుతామన్నారు. పార్శిల్ కౌంటర్ నుంచి పది కిలోమీటర్ల దూరం వరకు ఈ డోర్ డెలివరీ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని విజయవాడ, తిరుపతి, విశాఖపట్టణం, రాజమండ్రి, కాకినాడ, కర్నూలు, కడప, నెల్లూరు తదితర 80 పట్టణాల్లో డోర్ డెలివరీ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. తక్కువ చార్జీలతో సురక్షితంగా పార్శిల్, కొరియర్‌ను ఇంటి వద్దకు చేర్చుతామన్నారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం: ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్న ఓ యువకుడు గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కాళ్లు, చేతులకు శస్త్రచికిత్స చేయించుకున్నాక నొప్పులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ కే.సాయినాథ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం రూరల్ మండలం పరిధిలోని ఏ.నారాయణపురం గ్రామానికి చెందిన పూలశెట్టి సురేష్ (38) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఆరు సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాళ్లు, చేతులు విరిగాయి. వాటికి శస్త్రచికిత్స చేసిన వైద్యులు కాళ్లు, చేతులకు రాడ్‌లు అమర్చారు. దీంతో నొప్పులు భరించలేక మద్యానికి బానిసయ్యాడు. నొప్పులు అధికంగా ఉన్నాయని తరచూ కుటుంబ సభ్యులతో బాధపడుతూ ఉండేవాడు. కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రామ్మూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యాపారి ఆత్మహత్య


మృతుడు సోమశేఖర్

అనంతపురం: వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం యాదాలంకపల్లికి చెందిన సోమశేఖర్(40) కుటుంబంతో సహ వలస వచ్చి అనంతపురం - ధర్మవరం మార్గంలోని పంగల్ రోడ్డు వద్ద హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారం సక్రమంగా జరగకపోవడంతో అప్పుల భారం పెరిగింది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న సోమశేఖర్ బుధవారం ఉదయం పురుగుల మందు తాగాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కోలుకున్న అనంతరం గురువారం ఉదయం వైద్యులు డిశ్చార్జ్ చేయడంతో ఇంటికి పిలుచుకొచ్చారు. సాయంత్రం బయటకు వెళ్లివస్తానంటూ ఇంట్లో చెప్పి వచ్చిన సోమశేఖర్ నేరుగా పాలిటెక్నిక్ కళాశాలలోని క్రికెట్ గ్రౌండ్ వెనుక ఉన్న చెట్టుకు ఉరి వేసుకున్నాడు. అంతకు ముందు తాను ఆత్మహత్య చేసుకున్నట్లు సెల్ఫీ వీడియో తీసి కుటుంబ సభ్యులకు పంపాడు. దీంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని, ఉరికి వేలాడుతున్న సోమశేఖర్‌ను కిందకు దించి ప్రభుత్వా సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వెంటనే పదోన్నతులు కల్పించాలి

అనంతపురం క్రైం: ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారినప్పటి నుంచి నేటి వరకు ఎటువంటి పదోన్నతులు కల్పించ లేదని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని వి.కె భవన్‌లో అనంతపురం జిల్లా ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జి.వి.నరసయ్య మాట్లాడుతూ.. పీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగులు జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలన్నారు. ఉద్యోగి తప్పు చేయకుండా తప్పుడు కేసులతో పీటీడీ ఉద్యోగులను ఎక్కడైనా ఇబ్బంది పెడితే ఉద్యమాలు చేస్తామన్నారు. జోనల్ అధ్యక్షుడు కె.కె. కుమార్ మాట్లాడుతూ.. ఈహెచ్‌ఎస్‌తో వైద్య సౌకర్యాలు అందడం లేదన్నారు. రెఫరల్ ఆసుపత్రుల్లో వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా నాయకురాలు నాగమణి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులందరికీ ప్రస్తుతం ఇస్తున్న 180 రోజులు చైల్డ్‌కేర్ లీవులను కేంద్ర ప్రభుత్వంలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు ఇస్తున్న పద్ధతుల్లో 730 రోజులకు పెంచాలన్నారు. సమావేశంలో ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రచార కార్యదర్శి కె.కల్లప్ప, జి.మల్లికార్జున, ఉమ్మడి జిల్లాలోని 7 డిపోల్లో ఉన్న అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు గ్రహణం మొర్రి స్క్రీనింగ్ క్యాంప్

అనంతపురం మెడికల్: పెదవి చీలిక, గ్రహణం మొర్రి సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో స్క్రీనింగ్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఏబీఆర్ ఆస్పత్రి నిర్వాహకులు స్క్రీనింగ్ నిర్వహించి, ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారని తెలిపారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే స్క్రీనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తిరుప్పావై పఠనం ప్రారంభం


పారాయణం చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: వైష్ణవాలయాలు తిరుప్పావై పాశురాలతో మార్మోగుతున్నాయి. పవిత్ర ధనుర్మాసంలో సాగే తిరుప్పావై పఠనం అశోక్ నగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో ఘనంగా ప్రారంభమైంది. సంగీత విద్వాంసురాలు గుంటూరు సంధ్యామూర్తి నేతృత్వంలో వందలాది మంది భక్తులతో కలిసి అమ్మవారి పాశురాలలో రోజుకొకటి చొప్పున వచ్చే నెల 13 వరకు పఠనంతో పాటూ శిక్షణ కూడా ఇస్తారు. ఈ సందర్భంగా రమాసమేత సత్యనారాయణ స్వామి ఆలయ నిర్వాహకుడు అంబటి ఫణిరాజ్, తిరువీధుల జగదీష్ మాట్లాడారు. రోజూ ఉదయం 5:30 నుండి 7 గంటల వరకు సాగే నిత్య పారాయణంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

గుట్టుచప్పుడు కాకుండా పంచనామా


కొత్తూరు షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపును సీజ్ చేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ రెవెన్యూ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. గురువారం డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఆర్‌ఓలు లక్ష్మీదేవి, విజయ్‌కుమార్, ఆర్‌ఐలు రజాక్, చంద్రశేఖర్, పెద్దక్క, రఘునాథ్ రెడ్డిలు కొత్తూరు నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లో 28 షాపులకు పంచానామా చేశారు. గుట్టుచప్పుడు కాకుండా పంచానామా చేపట్టడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. వాస్తవంగా పంచానామా చేస్తున్నట్లు కనీసం మీడియా ద్వారా, సదరు అద్దె తీసుకున్న వారికి సమాచారం ఇవ్వాల్సి ఉంది. నూతనంగా బాధ్యతలు తీసుకున్న రెవెన్యూ సిబ్బంది అవగాహన రాహిత్యంతో పంచానామా చేపట్టినట్లు నగరపాలక సంస్థ వర్గాలు చెబుతున్నాయి.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం: మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు మందలించారనే కారణంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కే.సాయినాథ్ తెలిపిన వివరాలు.. సంఘమిత్ర కాలనీలో నివాసం ఉంటున్న షేక్‌వలీబా కుమారుడు షేక్ షేక్షావలికి మూడు సంవత్సరాల క్రితం నసీమాతో వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. షేక్షావలి గతంలో సెంట్రింగ్ పనులు చేసేవాడు. ప్రస్తుతం బారామసాల అమ్ముతూ జీవనం చేస్తున్నాడు. అతిగా మద్యం సేవిస్తూ ఉండటంతో తల్లి ముంతాజ్, భార్య మందలించే వారు. గురువారం మధ్యాహ్నం అతిగా మద్యం సేవించి తల్లి, భార్యతో గొడవపడ్డాడు. సాయంత్రం టీ కావాలని కోరగా.. టీ అందించే లోపే మరో గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య షేక్ నసీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రేపు అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం

అనంతపురం కల్చరల్: ఈనెల 21న అంతర్జాతీయ ధ్యాన దినోత్సవ వేడుకలు అనంతలోనూ ఘనంగా నిర్వహిస్తున్నారు. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో 21న ఉదయం 6 గంటల నుంచి 7:30 గంటల వరకు వివేకానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో ధ్యాన దినోత్సవ వేడుకలు జరుగుతాయి. పతంజలి యోగ సమితి, ప్రజాపతి బ్రహ్మకుమారీస్, హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ ఇనిస్టిట్యూషన్, పిరమిడ్ ధ్యానకేంద్రం, సత్యసాయి ధ్యానమండలి, ఆర్ట్ ఆఫ్ లివింగ్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే వేడుకల్లో పాల్గొనాలని నిర్వాహకుడు మెళవాయి రాజశేఖరరెడ్డి కోరారు.